తన పనేదో,తానేంటో అన్నట్లు ఉండే సదానందం దగ్గరికి హస్త సాముద్రికుడినంటూఅతను రావడంతో వచ్చింది చిక్కంతా.

సదానందం జ్యోతిషం, హస్త సాముద్రికం వంటి విషయాలలో బొత్తిగా ఆసక్తి లేనివాడు భవిష్యత్తుని గురించి తెలుసుకోడం, దానిని గురించి ఆలోచిస్తూ వర్తమానాన్ని నిర్లక్ష్యం చెయ్యడం అతని స్వభావానికే విరుద్ధం.

సదానందం స్వభావంతో పని లేదన్నట్లుగా, వచ్చి కూర్చుని తనని తను పరిచయం చేసుకున్నాడు. అతనికి వృత్తిరీత్యా అలవడిన వాక్చాతుర్యంతో సదానందం నిరాసక్తతని కొద్దిగా వదలగొట్టగలిగాడు.ఎదుటి వాళ్ళనాడి తెలిసిన వాడిలా చొరవగా సదానందం చేతిని తీసుకుని - సీరియస్ పది నిమిషాలు తేరిపార చూశాడు.

శాస్త్రజ్ఞుడు తన పరిశోధనా ఫలితాన్ని చూసుకుని ఎగిరి గంతేసినంత ఆనందం మొహంలో ప్రస్ఫుటమవు




# లాటరీ

—అయ్యగారి సుబ్బలక్ష్మి

తూండగా – అడిగాడు. "మీరెప్పుడైనా లాటరీ టిక్కెట్లు కొన్నారా?! లేదా రేసులు, పేకాట వంటివి అలవాటు ఉందా?!" అని.

సదానందం చిరాగ్గా మొహం పెట్టాడు.

"అవన్నీ నా చేతిలో కనిపిస్తున్నాయా?!" అన్నాడు సీరియస్‌గా.

"అరెరె! కోపగించుకోకండి సార్! అవన్నీ మీ చేతులో లేవు కానీ — అటువంటి వాటివల్ల వచ్చే ఆకస్మిక ధనలాభం మీ చేతిలో డీప్‌గా ఉంది". అన్నాడు ఇనుమడిస్తున్న ఉత్సాహంతో.

"చూడండి - నాకలాంటి ఈజీ మనీ మీద కాంక్ష కాని, ఆసక్తి కానీలేదు. ఏదైనా కష్టించి అనుభవించడం లోనే ఆనందం ఉందనుకునే మనిషిని నేను." నిక్కచ్చిగా అన్నాడు సదానందం.

"మీరు ఎంతకాదన్నా – మీకు ఆకస్మిక ధనలాభం వచ్చి తీరుతుందండి." అంటూ చేతిలో ఒక రేఖ చూపిస్తూ అది ఎంతో అరుదుగా ఉంటుందని, తను చూసిన వేల చేతులలో ఇది నాలుగోదో అయిదోదో అనీ. ఇంతకుముందు చెప్పిన వాళ్ళకి అది ఎలా నిజమైందో, వాళ్ళు ఇప్పుడు తనని ఎంత గౌరవించి ఆదరిస్తున్నారో విపులంగా చెప్పుకొచ్చాడు. అతని మాటల ప్రవాహం ఎలా ఉందంటే - వినే వాళ్ళు అవాక్కులై అతను చెప్పేదంతా వినాల్సిందే తప్ప - మరో మాటకి అవకాశం దొరకనీయకుండా మాట్లాడేస్తున్నాడు.

తర్వాత - తన పుట్టినరోజు తీసుకుని - ఏవో కూడికలు, తీసివేతలు, వగైరా లేవో చేసి - బల్లమీద రెట్టించిన ఉత్సాహంతో గట్టిగా కొట్టాడు.

"చూశారా?! మీ లక్కీ నంబర్ ఇది. ఇది లక్కీ నెంబర్‌గా గలవాళ్ళు ఎంతెంత ప్రముఖులో మీకు తెలుసా?!" అంటూగబగబా తన దగ్గరున్న గుడ్డ సంచీ లోంచి ఒక డైరీ లాంటి పుస్తకం తీసి గబగబా పేజీలు తిప్పాడు. టక్కున ఒక పేజీ దగ్గర ఆపి - ఆ నంబరు గల ప్రముఖుల పేర్లన్నీ చూపించాడు. తన మీద నమ్మకం కలగడం కోసం ఇవన్నీ సాక్ష్యాలుగా సేకరించానని చెప్పాడు.

పుస్తకం మూసి సంచీలో పెట్టుకుంటూ సదానందాన్ని 'మీ వ్యవహారనామం' ఏ(విటని అడిగాడు. సదానందం చెప్పగానే గబగబా ఒక పేపరు మీద సదానందం పేరు విడి అక్షరాలలో రాసి వాటికేవో అంకెలు వేసి. మళ్ళీ కూడికలు - తీసివేతలలాంటి లెక్కలేవో చేసి" చూశారా - మీ జన్మతేది - మీ పేరు ఎలా కో ఇన్సైడ్ అయ్యాయో?! ఇలా మీకు ఏరకంగా చూసినా అదృష్టం కలిసివచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మీరు వద్దన్నా మీకు ఆకస్మిక ధనలాభం కలిగే తీరుతుందని" నొక్కి చెప్పాడు. తనకున్న అదృష్టానికి తనవంతుగా ఏదో ఒకటి చేస్తే మరింత త్వరగా వస్తుందని పదే పదే చెప్తున్నా ఇంకా అపనమ్మకంగా చూసే సదానందంతో ఛాలెంజ్ చేసాడు అతడు.

ఒక వేళ అతను చెప్పినట్లు సదానందం చేసిన ఏ ప్రయత్నంలో నైనా నష్టపోతే తనకొచ్చిన విద్యని వదిలేస్తానని, అతను చెప్పినట్లు సదానందానికి ధనలాభం కలిగితే - సదానందానికి తోచినంత ఆనందంగా ఇచ్చేట్లు ఒప్పందానికి వచ్చారు.

సదానందం - అతని మాటల గారడీలో పడిపోయినట్లు - తనవంతు ప్రయత్నం ఎలా చెయ్యాలో అతన్నే సలహా అడిగాడు.

ఏ రకమైన మానసిక అలజడి అనవసర కాలయాపన కలిగించని లాటరీ పద్ధతే అనుసరించమన్నాడు. మార్కెట్టులోకి వస్తున్న అనేక లాటరీలలో ఏదైనా ఒకటి ఎంచుకుని ప్రయత్నం చేయమన్నాడు.

సదానందానికి కూడా అదే నచ్చింది. రేసులకి, పేకాటకి అనవసరంగా కాలం వృధాగా గడపాల్సి రావడమే కాక, శారీరక, మానసిక అలసటను కూడా అనుభవించాలి. లాటరీ టిక్కెట్లు కొనడంలో అవేమీ ఉండవనుకున్నాడు.

అతను చెప్పినట్లు సదానందం- ఆ రోజు సాయంత్రమే ఓ అయిదు లాటరీ టిక్కెట్లు కొనుక్కుని ఇంటికి వెళ్ళాడు. ఆ మర్నాడు సాయంత్రం లాటరీ ఫలితాలు చూసుకున్న సదానందానికి మతి పోయింది. తాగుడు అలవాటులేని మనిషి ఒక్కసారి సీసా ఎత్తి గటగటా తాగేస్తే ఎలా ఉక్కిరిబిక్కిరి అవుతాడో అలా ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. ఒక పరిస్థితిలో ఆ ఆనందంలో గుండె ఆగిపోతుందేమోనని పించింది.

లాటరీ టిక్కెట్ల ఏజెంట్ సదానందాన్ని మర్యాదగా కూర్చోబెట్టాడు.అతనికి వచ్చిన యాభై వేల రూపాయల్ని ఎలా తెచ్చుకోవాలో, ఫార్మాలిటీస్ ఏమిటో అన్నీ వివరంగా చెప్పి పంపించాడు.

ఆ ఆనందంలో నెల సరుకులకని జేబులో పెట్టుకుని వచ్చిన అయిదొందలలో మూడొందలు పెట్టి అన్ని స్టేట్ లాటరీలు పిచ్చిగా కొనేశాడు. ఇంటికి వెళ్తూ భార్యా పిల్లలకి ఐస్‌క్రీములు, స్వీట్స్, పళ్ళు ఆబగా కొనుక్కుని జేబులో యాభై రూపాయలతో ఇల్లు చేరాడు. యాభై వేలు లాటరీలో వచ్చాయన్న సంతోషం ఆ ఇల్లాలికి కూడా నెల సరుకు ఇంటికి రాలేదనీ, తెల్లారితే నిత్యావసర వస్తువులు కూడా ఇంట్లో నిండుకున్నాయనీ గుర్తు రానీయలేదు.

ఆ తర్వాత- సదానందం పరిస్థితి సాలెగూటిలో చిక్కుకున్న ఈగ చందమైంది.

కానీ విచిత్రమేమిటంటే సదానందానికి ఆ పరిస్థితి స్ఫురణకి రానంత మత్తు ఆవరించింది.

యాభై వేల లాటరీ తగలడం నిజమే కానీ దానికోసం సోషల్‌వెల్ఫేర్ ఆఫీసు చుట్టూ తిరగడానికి, అక్కడ సమర్పించుకోవాల్సి వచ్చిన టిప్స్‌కి, టాక్స్‌కు, ఆఫీసులో స్టాఫ్‌కి పార్టీలకి హస్త సాముద్రికుడికి ఇచ్చింది సదానందం లెక్క వేసుకోలేదు కానీ ఇరవై వేల దాకా ఖర్చయిపోయింది.

హస్తసాముద్రికుడు సదానందం నుంచిపొందిన పారితోషికానికి సంతృప్తి పడుతూ హితవాక్యం చెప్పాడు.

సదానందంగారూ- ఇది మీ భాగ్యమే కానీ నదిమంత్రపు సిరిలాంటిది. ప్రవాహంలో కొట్టుకుపోకుండా జాగ్రత్తగా మీ భవిష్యత్‌ని తీర్చిదిద్దుకోండి. వచ్చిన లక్ష్మిని నిలుపుకోండి. జీవిత చక్రానికి ఇరుసులాంటిది వివేకం. అది పోగొట్టుకోకండి. వివేకం ఉన్నవాడి దగ్గర మనఃశాంతి ఉంటుంది. అది జీవితానికి ముఖ్యం.

సహజంగానే సదానందం అతని మాటల్ని గాలికి వదిలేసాడు. అలా మొదలైన లాటరీల ప్రహసనం సదానందానికి నిత్యకృత్యం అయిపోయింది.

భార్య కోసం వాషింగ్ మిషన్, కొడుకు కోసం కలర్ టి.వి. వి.సిఆర్, కూతురు కోసం ఫ్రిజ్ ఇలా ఎవరేది అడిగితే అది కొనిచ్చే సదానందం దేవుళ్ళా కనిపించాడు.

తన కష్టార్జితంతో అప్పుడూ అప్పుడూ జాగ్రత్తగా దాచుకున్న బ్యాంక్ బేలన్స్ అయిపోయినా కించిత్ కూడా బాధపడలేదు.

వందలకి వందలు లాటరీ టిక్కెట్ల మీద ఖర్చుపెడుతూనే ఉన్నాడు. అప్పుడప్పుడు చిన్న చిన్న మొత్తాలు తగులుతూనే ఉన్నా అవి తిరిగి లాటరీ టిక్కెట్లుకొనడానికి, అవి తగిలిన ఆనందంలో చేసే ఖర్చులకి చాలడం లేదు. వచ్చే ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువై- అప్పు చేయాల్సి వస్తున్నందుకు సదానందం బాధపడడం లేదు. ఎప్పటికైనా లక్ష తగిలి తీరుతుంది- నిమిషంలో అప్పంతా తీర్చలేనా అనుకుంటున్నాడు.

రోజులు గడిచిన కొద్దీ లాటరీల వలన రాబడి తగ్గి, ఖర్చు పెరిగి రెండింటికి లంగరందక సతమతమైపోతున్నాడు. లాటరీల ఆనందంలో కొత్తగా అలవాటయిన తాగుడు సదానందాన్ని నిలబడనీయడం లేదు.

లాటరీ టిక్కెట్ల కోసం, అవి తగలలేదన్న బాధతో తాగడం కోసం కనిపించిన ప్రతివాడి దగ్గర అప్పు చేసేసాడు. అతని దగ్గర డబ్బున్నప్పుడు ఆకాశానికి ఎత్తేసిన వాళ్ళే ఇప్పుడు సదానందం పరిస్థితికి చీదరించుకుంటున్నారు.

హాయిగా చీకూ చింతాలేని సదానందానికి ఆనాడు లాటరీ టిక్కెట్టు కొనడం ఆట అయితే అదే సదానందానికి ఈనాడు లాటరీ టిక్కెట్టు కొనడం అవసరమైంది. ఒకరకంగా వ్యసనమైంది. కష్టాలు కలిసి వస్తాయన్నట్లుగా తాగుడు అతన్ని మరీ దిగజార్చింది.

అతని కష్టాలు ఇప్పుడు నిజంగా లాటరీ తగిలితేనే తీరాలన్నట్లుగా ఉన్నాయి. ఎప్పటికైనా లాటరీలో లక్ష రాకపోతుందా అన్నట్లు వాటికోసం ఇంట్లో సామాన్లు కూడా ఒకటి ఒకటి మెల్లగా బయటికి వెళ్ళిపోతున్నాయి.

ఒకప్పుడు దేవుళ్ళా కనిపించిన సదానందమే ఇప్పుడు భార్యా పిల్లలకి పిశాచంలా కనిపిస్తున్నాడు.

అప్పుడప్పుడు- సదానందం లోపలిమనిషి తన పరిస్థితిని తనకి గుర్తు చేస్తూనే ఉన్నాడు. అయినా పూర్తిగా ఊబిలోకిదిగబడిపోయినవాడిలా లోపలి మనిషి హెచ్చరికలు నిస్సహాయుడిలా విన్నాడే తప్ప తనని తను మార్చుకునే ప్రయత్నం చేయలేకపోయాడు.

మరీ విసిగిపోయిన ఒక సందర్భంలో తనున్న పరిసరాలకి, తన అనుకున్నవాళ్ళకి దూరంగా తన జీవితం ఎప్పుడు ఎలా సాగుతుందో, ఎలా ముగుస్తుందో తెలియని అయోమయంలో లాటరీ ఫలితాల కోసం ఎదురు చూసే పిచ్చివాడిలా జీవితాన్నే లాటరీ చేసుకున్నాడు సదానందం. ●

## వెక్కిరంత

**ఒకసారి లండన్‌లో తన "ఆర్మ్స్ అండ్ ది మాన్" నాటకం ప్రదర్శన అయిన వెంటనే బెర్నార్డ్ షా స్టేజీ మీద ఒక చివర నుంచున్నాడు. ప్రేక్షకులంతా హర్షధ్వానులు చేస్తున్నారు. ఒక యువకుడు మాత్రం ఒక మూల నుంచి వెక్కిరించడం మొదలుపెట్టాడు. షా శాంతంగా ఆ యువకుడి వైపు చూస్తూ "బ్రదర్! మన మిద్దరం ఏం చేయగలం ప్రేక్షకులంతా ఒకవైతే?" అన్నాడు.**

సేకరణ: గోపిశెట్టి మానస [గుంటూరు]